ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది.30.01.2025 సమయం.13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. కేంద్ర బడ్జెట్ సమావేశాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరసగా ఎనిమిదో సారి బడ్జెట్ ప్రవేశ పెడుతున్నారు.

2. రాష్ట్రంలో మూడు శాసనమండలి స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల నేపథ్యంలో ఆయా జిల్లాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది.

3. ఈరోజు జరిగిన GHMC సర్వ సభ్య సమావేశంలో 2025-26 బడ్జెట్ కు గందరగోళ పరిస్థితుల మధ్య కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

4. ఈ రోజు జాతిపిత మహాత్మా గాంధీ 77వ వర్ధంతి సందర్భంగా ప్రముఖు, ప్రజలు రాష్ట్రవ్యాప్తంగా నివాళులు అర్పిస్తున్నారు.

-----------------------------

**బడ్జెట్**

కేంద్ర బడ్జెట్ సమావేశాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరసగా ఎనిమిదో సారి బడ్జెట్ ప్రవేశ పెడుతున్నారు.

రేపు పార్లమెంట్లో ఆర్థిక సర్వే ప్రవేశపెడతారు. ఈ ఏడాది బడ్జెట్ వ్యయం పెరగొచ్చనే అంచనాల నేపథ్యంలో రాష్ట్రానికి సైతం కేటాయింపులు పెరుగుతాయని భావిస్తున్నారు. ముఖ్యంగా రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులు, వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు, మౌలిక వసతుల కల్పనకు అవసరమైనంత మేర సాయం లభిస్తుందని భావిస్తున్నారు. వీటితో పాటు ఫ్యూచర్ సిటీ, హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణ, ప్రాంతీయ వలయ రహదారి తదితరమైన వాటికి కేంద్రం సాయం అవసరమని నిపుణులు భావిస్తున్నారు. గ్రాంట్లు, పన్నుల కేటాయింపుల్లో రాష్ట్రానికి రావాల్సిన వాటాలపై ఈసారి భారీగానే అంచనాలున్నాయి. 15వ ఆర్థిక సంఘం సిఫారసు మేరకు రాష్ట్రానికి 41 శాతం వాటా రావాల్సి ఉంది. ఆ మేరకు పన్నుల్లో వాటా పూర్తి స్థాయిలో ఇస్తే 5 నుంచి 8 వేల కోట్ల రూపాయలు అదనంగా వస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఉపాధి హామీ, స్మార్ట సిటీలు, జాతీయరహదారులు, ఇతర పథకాలకు తగినన్ని నిధులు కేటాయిస్తే రాష్ట్రానికి ప్రయోజనం చేకూరుతుంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవ పథకానికి, పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి రాష్ట్రం ఇప్పటికే బడ్జెట్లో కేటాయింపుల ఇవ్వమని కేందరానికి ప్రతిపాదనలు పంపింది.

ఈ అంశంపై సీనియర్ పాత్రికేయులు డాక్టర్ కే.వీ. కూర్మనాథ్ తన అభిప్రాయాన్ని ఆకాశవాణితో తన అభిప్రాయాన్ని పంచుకుంటూ..

----------**బైట్**-------------

ప్రముఖ కవి, సామాజిక విశ్లేషకులు, ఉపాధ్యాయులు పెద్దింటి అశోక్ కుమార్ బడ్జెట్ గురించి ఆకాశవాణితో మాట్లాడుతూ..

-----------**బైట్**-----------

**డెస్క్, పిటిసి ,రాజన్న సిరిసిల్ల**

---------------------

**ఎమ్మెల్సీ ఎన్నికలు**

కరీంనగర్- ఆదిలాబాద్- నిజామాబాద్- మెదక్ జిల్లాల్లో రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్ర ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల కలెక్టర్లు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాల పరిధిలోని మొత్తం పట్టభద్రుల మొత్తం ఓటర్లు 3 లక్షల 52 వేల 369 మంది ఉండగా పోలింగ్ కేంద్రాలు-499 ఉన్నాయి. ఉపాధ్యాయ ఓటర్లు మొత్తం -25 వేల 921 మంది ఉండగా పోలింగ్ కేంద్రాలు-274 ఉన్నాయి.

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులను ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం చేశారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ MLC ఎన్నికల ప్రవర్తనా నియమావళి వచ్చిందని ఆసిఫాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల జిల్లాలో సైతం ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు

**పిటిసి, కరీంనగర్, ఆసిఫాబాద్, మంచిర్యాల**

----------------------------

**GHMC కౌన్సిల్ సమావేశం**

2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను 8 వేల 4వందల 40 కోట్ల రూపాయల బడ్జెట్‌కు GHMC కౌన్సిల్ ఆమోదం తెలిపింది. GHMC మేయర్ గద్వాల

విజయలక్ష్మి ఈ రోజు జరిగిన సర్వ సభ్య సమావేశంలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. బడ్జెట్ పై చర్చ ప్రారంభానికి ముందు ఇటీవలే మరణించిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, రతన్ టాటాకు కౌన్సిల్ నివాళులు అర్పించింది. అనంతరం బడ్జెట్ ప్రవేశపెట్టారు. చర్చ ప్రారంభం కాగానే బీఆర్ఎస్ కార్పొరేటర్లు ప్రశ్నోత్తరాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులతో పోడియాన్ని చుట్టుముట్టేందుకు ప్రయత్నించారు. వారిని కాంగ్రెస్ కార్పొరేటర్లు అడ్డుకున్నారు. దీంతో రెండు పార్టీల కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈక్రమంలో చర్చ లేకుండానే బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అంతకుముందు సర్వసభ్య సమావేశానికి భిక్షాటన చేస్తూ బీజేపీ కార్పొరేటర్లు జీహెచ్ఎంసీ కార్యాలయానికి వచ్చారు. గోషామహల్ స్టేడియాన్ని కూల్చొద్దని.. అక్కడ ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించొద్దంటూ నినాదాలు చేశారు. ఉస్మానియా ఆసుపత్రి వెనక ఉన్న ప్రాంతంలోనే నిర్మించాలని డిమాండ్ చేశారు.

డెస్క్

---------------------------

**కలెక్టర్ రాత్రి బస**

ప్రభుత్వ వసతి గృహాల్లో కలెక్టర్లు  రాత్రి బస చేయాలనే ప్రభుత్వ ఆదేశాల మెరకు వివిధ జిల్లాలకు చెందిన కలెక్టర్లు ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ పాఠశాలల వసతి గృహాల్లో బస చేశారు. విద్యార్థులకు కల్పిస్తున్నా సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. భోజన హాలు, తరగతి గది, వసతి గృహం పరిసరాలు, వంట గదులను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఆసిఫాబాద్ జిల్లాలోని తిర్యాని మండల కేంద్రంలో గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి రాత్రి బస చేశారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల వసతులను విద్యార్థులకు కల్పించాలని అధికారులు, ఉపాధ్యాయులకు సూచించారు.

పాల్వంచలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాల, వసతి గృహంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ రాత్రి బస చేశారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి అక్కడే పడుకుని ఉదయం వారితో కలిసి అల్పాహారం చేశారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాల కోసం నిరంతరం శ్రమించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు.  కలెక్టర్ , అదనపు కలెక్టర్ మాధురితో కలిసి ఇస్నాపూర్ లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో రాత్రి బస చేశారు

**PTC- B.KGM, ఆసిఫాబాద్, సంగారెడ్డి**

------------------

**వాట్సాప్ గవర్నెన్స్**

దేశంలోనే తొలిసారిగా.. పౌరసేవలు అందించేందుకు, ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు, వారికి అవసరమైన సమాచారాన్ని చేరవేసేందుకు వీలుగా వాట్సప్ గవర్నెన్స్ ను ఆంద్రప్రదేశ్ ప్రభుత్వం ఈ రోజు ప్రారంభించనుంది. . ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఈ రోజు దీన్ని అధికారికంగా ఈ సేవలను ప్రారంభిస్తారు. ఈ విధానం ద్వారా తొలి దశలో మొత్తం 161 రకాల పౌర సేవలు అందించనుంది. తొలి విడతలో దేవాదాయ, ఇంధన, APSRTC, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించిన సేవలు వాట్సాప్ ద్వారా

అందుతాయి. వాట్సాప్ ద్వారా సేవలందించేందుకు గతేడాది మెటాతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది.

**డెస్క్**

--------------------

**మహాత్మా గాంధీ వర్ధంతి**

ఈ రోజు జాతిపిత మహాత్మా గాంధీ 77వ వర్ధంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, ప్రముఖులు నివాళులు అర్పిస్తున్నారు. హైదరాబాద్‌లోని బాపూ ఘాట్ వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. దేశం కోసం స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన సేవలను వారు గుర్తు చేసుకున్నారు. వారి వెంట మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు ,పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ జితేందర్ తదితరులు ఉన్నారు.

**డెస్క్, పీటీసీ రాజన్న సిరిసిల్ల**

--------------------------------

**ఉపాధి హామీ**

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలో ఈ ఉదయం ఉపాధి హామీ పనులు చేస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో ఇద్దరు మహిళా కూలీలు మృతి చెందారు. ఉపాధి హామీ పనిచేస్తుండగా బండరాళ్లు మీద పడి కందారపు సరోజన, అన్నారి మమత మృతి చెందగా, పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. మరణించిన ఇద్దరూ తల్లీ కూతుళ్లు. క్షతగాత్రులను 108 ద్వారా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇద్దరు ఉపాధి హామీ

కూలీలు మరణంపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ద్రిగ్భాంతి వ్యక్తం చేశారు. ఘటనకు సంబంధించిన కారణాలపై జిల్లా కలెక్టర్ తో మాట్లాడారు. ఈ ఘటనపై విచారణకు మంత్రి ఆదేశించారు. గాయపడిన మరో ఇద్దరికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. మరణించిన, గాయపడిన ఉపాధి హామీ కూలీల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసా కల్పించారు.

**సిద్దిపేట, పీటీసీ..**

------------------------------